ఆగిపోయిన ఆధునికీకరణ పనులు

- ప్రభుత్వ పాఠశాలల్లో నత్తనడకన నాడు–నేడు పనులు
- సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, టీచర్లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం


జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామంలో అసంపూర్తిగా నిలిచిపోయిన అదనపు తరగతి గదులు భవనాలు

పెనుగంచిప్రోలు/జగ్గయ్యపేట: ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించి, వాటిలో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మనబడి నాడు–నేడు పథకం కింద పాఠశాలల ఆధునికీకరణ పనులు చేపట్టింది. గతంలో శిథిలావస్థలో ఉన్న పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా మొదటి విడతలో అభివృద్ధి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యాబోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు గట్టి నమ్మకం ఏర్పరిచారు. అదే విధంగా రెండో విడతలో కూడా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపిక చేసి నిధులు మంజూరు చేశారు. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఆధునికీకరణ పనులు నిలిచిపోయాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పనుల గురించి పట్టించుకోకపోవడంతో వాటి అభివృద్ధి అతీగతీ లేకుండా పోయింది. కొన్ని పాఠశాలల్లో గదులు పూర్తయినప్పటికీ గచ్చులు, కిటికీలు, రంగులు వేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిపై పలు కారణాలు చెబుతున్నారు. దీంతో అరకొర వసతుల మధ్య విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకంతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. నాడు–నేడు పథకంలో భాగంగా మొదటి విడతలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి తొమ్మిది రకాల వసతులు కల్పించింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మారిన బడులు చూసి సంతోషపడ్డారు. ఫలితంగా చెట్ల కింద కూర్చొని చదవడం, ఆరుబయట కాలకృత్యాలు తీర్చుకోవడం, చేతిపంపుల వద్ద భోజనం ప్లేట్లు శుభ్రం చేసుకోవడం, ఇంటి వద్ద నుంచి తాగునీటి బాటిళ్లు తెచ్చుకోవడం వంటివి కనిపించకుండా పోయాయి. అయితే చివరి దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ పనులు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రస్తుతం ఆగిపోయాయి. ఇప్పటికైనా నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


రంగులు వేసి, ఫ్లోరింగ్ వేస్తే వినియోగంలోకి రానున్న కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లోని అదనపు తరగతి గదులు


నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిపోయిన చిల్లకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం

నిధుల మంజూరు ఇలా..

గత ప్రభుత్వంలో మనబడి నాడు–నేడు పథకంలో భాగంగా నియోజకవర్గానికి మంజూరైన నిధులు ఇలా ఉన్నాయి. పెనుగంచిప్రోలు మండలంలో మొదటి ఫేజ్‌లో 16 పాఠశాలలకు రూ. 3.45 కోట్లు, రెండవ ఫేజ్‌లో 31 పాఠశాలలకు సుమారు రూ. 11.42 కోట్లు ఖర్చు చేసింది. జగ్గయ్యపేట మండలంలో ఫేజ్–1లో 25 పాఠశాలలకు రూ. 7.51 కోట్లు, ఫేజ్–2లో 57 పాఠశాలలకు రూ. 21.53 కోట్లు మంజూరు చేశారు. అలాగే వత్సవాయి మండలంలో ఫేజ్–1లో 26 పాఠశాలలకు రూ. 5.51 కోట్లు, ఫేజ్–2లో 24 పాఠశాలలకు రూ. 9.28 మంజూరు అయ్యాయి.


రంగులు వేయాల్సిన అనిగండ్లపాడు జెడ్పీ హైస్కూల్

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట మండలంలో అసౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రధానంగా 12 జిల్లా పరిషత్, 39 మండల పరిషత్ ప్రాథమిక, 8 మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో గత ప్రభుత్వ హయాంలో నాడు–నేడు పథకం ద్వారా పలు పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, టాయిలెట్స్, కిచెన్ షెడ్లతో పాటు మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు చేసింది. అయితే ఎన్నికలు రావడంతో కొన్ని పాఠశాలల్లో నిర్మాణ పనులు నిలిపివేశారు.

నిధులు విడుదల చేయని సర్కార్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినప్పటికి నిధులు విడుదల చేయకపోవడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం రూ. 2 కోట్లకు పైగా నిధులు విడుదల చేస్తే పేట మండలంలో పలు పనులు పూర్తవుతాయని ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. కొన్ని పాఠశాలల్లో నిధులు ఉన్నప్పటికి పనులు జరగకపోవడంపై విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్మాణపనులను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయింది.

తగిన చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ పాఠశాలల్లో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులు ప్రభుత్వం నుంచి నిధులు రాగానే ప్రారంభిస్తాం. కొన్ని పాఠశాలల్లో నిధులున్నప్పటికి పనులు జరగడం లేదు. ఈ విషయం మీద కూడా చర్యలు తీసుకుంటాం.

– జి.మహేశ్వరరావు, అదనపు పథక సమన్వయకర్త, సమగ్ర శిక్ష, విజయవాడ

క్లుప్తంగా

శివాలయాల్లో జన్మనక్షత్ర పూజలు



నందిగామ టౌన్: మండలంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం స్వామివారికి జన్మనక్షత్ర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వరస్వామి, గోళ్లమూడి శంభులింగేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వపుష్పార్చన తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు.

వెటర్నరీ కోర్సుతో మంచి భవిష్యత్తు




గరికపాడు(జగ్గయ్యపేట): వెటర్నరీ కోర్సుతో మంచి భవిష్యత్తు ఉంటుందని కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు పేర్కొన్నారు. గ్రామంలోని కేవీకేలో లైఫ్ స్కిల్స్ వెటర్నరీ ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు 45 రోజుల పాటు జరగనున్న శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెటర్నరీ కోర్సు చదువుకున్న విద్యార్థులకు భవిష్యత్తులో మంచి ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కేవీకే పశువైద్యాధికారి జశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

387 పత్తి బోరాలు కొనుగోలు



కంచికచర్ల: కంచికచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన భారత పత్తి సంస్థ ఆధ్వర్యంలో రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు చేసినట్లు సీసీఐ బయ్యర్ నాయక్ సోమవారం తెలిపారు. కొనుగోళ్ల కేంద్రానికి 387 పత్తి బోరాలను రైతులు తీసుకువచ్చారన్నారు. అత్యధిక ధర రూ. 7,346లు పలుకగా అత్యల్ప ధర రూ. 7,271లకు కొనుగోలు చేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు మాత్రమే పత్తిని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోళ్లు జరిగిన పత్తి బోరాలను గుంటూరుకు తరలిస్తున్నామని తెలిపారు. రైతులు పండించిన పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు



నందిగామ టౌన్: మండలంలోని పలు గ్రామాల్లో గల వైష్ణవాలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి, రామాలయంలో గోదా సమేత కృష్ణమూర్తి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అష్టోత్తర సహస్రనామ పూజలు, పుష్పార్చన తదితర పూజాది కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అండాళ్ ఘోష్ఠి సభ్యులు తిరుప్పావై పారాయణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జగ్గయ్యపేట: ధనుర్మాస ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండల, పట్టణాల్లోని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. పట్టణంలోని రంగనాయక స్వామివారి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు మూర్తి ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళ, బుధవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నితిన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

నందిగామ టౌన్: రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని కొండూరు గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పట్టాదారు పాసుపుస్తకం, అడంగల్, సర్వే తదితర సమస్యలపై రెవెన్యూ సదస్సు ల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. అనంతరం ఆయా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రైతుల నుంచి 17 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణికుమారి, వీఆర్వో రతన్‌బాబు, గ్రామ నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బోదవాడ(వీరులపాడు): మండలంలోని బోదవాడ గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ హుసేన్ మాట్లాడుతూ రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి రైతులు 10 దరఖాస్తులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో అరుంధతీ దేవి, సర్పంచ్ శీలం సంధ్య, ఎంపీటీసీ సభ్యురాలు యాదాల సుజాత, నాయకులు మద్దినేని లక్ష్మణరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ రైతుల నుంచి 11 దరఖాస్తులు స్వీకరించారు. వీఆర్వో హుసేన్, సర్వేయర్ అనూష్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రావూరి విశ్వనాథం, టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా ధర్మవరప్పాడుతండా గ్రామంలో నిర్వహించిన సదస్సులో రైతులు 16 దరఖాస్తులు అందజేశారు.


చిల్లకల్లులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

35 అర్జీలు స్వీకరణ

భీమవరం(వత్సవాయి): గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ భూ సమస్యల మీద అర్జీలు అందించవచ్చునని తహసీల్దార్ ఎస్ నరసింహారావు తెలిపారు. గ్రామ సచివాలయ ఆవరణలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలపై అర్జీలను అందించారు. ముఖ్యంగా అడంగల్, 1–బీ లు రావడం లేదని, పేర్లు, తండ్రి పేర్లలో తప్పులు ఉన్నట్లు, విస్తీర్ణంలో తేడాలు ఉన్నవే ఎక్కువగా అర్జీలు వస్తున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. సదస్సులో మొత్తం 35 అర్జీలు అందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు

- నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకు
- ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళనలో గ్రామస్తులు
- చర్యలు తీసుకోని అధికారులు


ఓవర్‌హెడ్ ట్యాంకు పిల్లర్‌కు బయటకు వచ్చిన ఇనుప చువ్వలు


గండేపల్లిలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు

గండేపల్లి(కంచికచర్ల): నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని సమీపంలో నివసించే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని గండేపల్లిలో 1984–85 సంవత్సరంలో రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేశారు. గ్రామస్తుల దాహాన్ని తీర్చిన ఈ ఓహెచ్‌ఆర్ ట్యాంకు నేడు శిథిలావస్థకు చేరింది.

కూలిపోతే పెద్ద ప్రమాదం

రక్షిత మంచినీటి సరఫరాకోసం ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థ దశకు చేరడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ ట్యాంకు సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ఓహెచ్‌ఆర్ ట్యాంకు పక్కనే విద్యార్థులు క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ వంటి పలు ఆటలు ఆడుతుంటారు. శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఓవర్ హెడ్ ట్యాంకుకు ఏర్పాటు చేసిన పిల్లర్లకు ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. శిథిలావస్థకు చేరుకోవడంతో అధికారులు తాగునీటిని ట్యాంకులోకి సరఫరా చేయడం లేదు. అంతేకాకుండా ఆ ట్యాంకు చుట్టూ దట్టంగా ముళ్ల కంపలు, పిచ్చిమొక్కలు పెరిగాయి. దీంతో ముళ్లపొదల్లో విష పురుగులు సంచరిస్తున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఈ ట్యాంకును తొలగించి కొత్తగా మరో ఓవర్ హెడ్ ట్యాంకును ప్రభుత్వం మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్త ట్యాంకు నిర్మాణం చేపట్టాలి



మా ఇంటి పక్కనే ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. దీనిని నలభై ఏళ్ల క్రింత నిర్మించారు. ఇప్పుడు శిథిలావస్థకు చేరింది. అంతేకాకుండా ఈ ట్యాంకు చుట్టూ దట్టంగా కంపచెట్లు పెరిగాయి. దీంతో విషపురుగులకు ఆవాసకేంద్రంగా తయారయింది. పక్కనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. ట్యాంకు ఎప్పుడు కూలిపోతుందో తెలియని దుస్థితి నెలకొంది. ఈ ట్యాంకును తొలగించి కొత్త ట్యాంకు నిర్మాణం చేపట్టాలి.

– సంగం దేవరాజు, మాజీ ఉపసర్పంచి, గండేపల్లి

ముగిసిన తిరునాళ్ల మహోత్సవం

చందర్లపాడు(నందిగామ టౌన్): చందర్లపాడు మండలంలోని చింతలపాడు గ్రామంలో వేంచేసియున్న నూకేశ్వరీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం గంగపాలేటి వెళ్లుట, దీవెన బండారు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. తిరునాళ్ల మహోత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆలయ చైర్మన్ కందుకూరి సత్యనారాయణ, కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రాత్రి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా మాదిరిగా ఈ ఏడాది కూడా అందరి సహకారంతో ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రత్యేక పూజల అనంతరం జగన్‌మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ జానీ, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నూకేశ్వరీ అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

దివ్యాంగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

జగ్గయ్యపేట అర్బన్: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని జగ్గయ్యపేట నియోజకవర్గం దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులందరికి అంత్యోదయ అన్నయోజన కార్డులు మంజూరు చేసి 35 కిలోల బియ్యం ఇప్పించాలని కోరారు. అలాగే దివ్యాంగులకు రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని, భర్త, భార్య దివ్యాంగులుగా ఉన్న కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి కుటుంబ పోషణకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రైతు బజార్లలో దివ్యాంగులకు స్టాల్స్ కోటా పెంచాలని, జీవనోపాధి కోసం సబ్సిడీతో రుణాలను మంజూరు చేయాలని పేర్కొన్నారు. నివేశన స్థలాలు, గృహ నిర్మాణ పథకం అమలు చేయాలని, అన్ని శాఖల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని కోరినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సంఘ కార్యదర్శి గోనెల విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి మంద రవి, జగనమ్మ ఉన్నారు.

విశ్రాంతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన

వీరులపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని గ్రామ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు గ్రామంలో వేంచేసియున్న సోమేశ్వరస్వామివారి ఆలయంలో దాతల సహకారంతో చేపడుతున్న రెండు విశ్రాంతి గదుల నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ముందుగా ఆలయ అర్చకులు యనమదల ప్రసాద్ శర్మ, వెంకట శేషసాయి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ నాయకులు మాట్లాడుతూ గ్రామాలు, ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం విశ్రాంతి గదుల నిర్మాణానికి రూ. నాలుగు లక్షల విరాళమందించిన గ్రామానికి చెందిన సోమసుందరరావును సత్కరించారు. కార్యక్రమంలో కాపా రాంబాబు, అమర మోహనరావు, పమిడిమర్రి జగన్‌మోహనరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.


విశ్రాంతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అర్చకులు, గ్రామస్తులు

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


క్రిస్మస్ గీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని కాకాని నగర్‌లో ఎల్ఈఎఫ్ చర్చిలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. ఈ వేడుకల్లో ముందుగా క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. అనంతరం స్థానిక సంఘ కాపరి శాంసన్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో విజయవాడకు చెందిన పాస్టర్ డాక్టర్ జాషువా క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. మానవుల పాపాల పరిహారార్థమై క్రీస్తు రెండు వేల ఏళ్ల క్రితం మానవ రూపంలో ఈ లోకంలో జన్మించి శిలువపై మృతి చెంది మూడవ రోజున లేచారని తెలిపారు. ఆయన పుట్టిన రోజును ప్రపంచ వ్యాప్తంగా జరుపుకొంటారన్నారు. చిన్నారులు, మహిళలు ఆలపించిన గీతాలు, నాటికలు అలరించాయి. వత్సవాయి, మల్కాపురం, కోదాడ, చందర్లపాడు పాస్టర్లు ఎ.రాజారావు, ఏసుపాదం, టి.బాబురావు, జయంతిరావు, సంఘస్తులు, విశ్వాసులు పాల్గొన్నారు.

నేడు కొత్తపేటలో రెవెన్యూ సదస్సు

కంచికచర్ల: మండలంలోని కొత్తపేట గ్రామ సచివాలయంలో మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పీ జాహ్నవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ సదస్సులో రైతులకు సంబంధించిన భూముల సర్వేలో కొలతలు, సరిహద్దుల్లో తేడాలు ఉన్నా.. పట్టాదారు పాసుపుస్తకాలు రాకపోయినా అర్జీలు దాఖలు చేసుకోవచ్చని చెప్పారు. రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామానికి చెందిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

నేడు డీసీ కమిటీల ఎన్నిక

వీరులపాడు: మూలపాడు మేజర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు మండలంలోని జుజ్జూరు గ్రామంలోని జిల్లి ఏసోబు కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సాగునీటి సంఘాల ఎన్నికల జిల్లా అధికారి చిత్రపు శైలజ పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ సాగునీటి సంఘాల ఎన్నికల్లో మేజర్ ఇరిగేషన్ పరిధిలోని ఏడు కెనాళ్లకు ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: వైద్యం కోసం ప్రభుత్వాస్పత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ రోజుకు 200 నుంచి 300 వరకు ఓపీ వస్తున్నారని, ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ఇక్కడ నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నారని వివరించారు. అలాగే ఆస్పత్రి అభివృద్ధికి కావలసిన సౌకర్యాలను కల్పించడంతో పాటు ఇంకా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆళ్ల హరీష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు యలమంచిలి వెంకటలక్ష్మి, పద్మనాభుని కుటుంబరావు, గుడిసె నాగేశ్వరరావు, పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధ, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించండి

జిల్లా వనరుల కేంద్రం డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ మాధవీలత



జి.కొండూరు: మేలైన సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించినప్పుడే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించగలుగుతారని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ మాధవీలత అన్నారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రబీ సాగుపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించిన మాధవీలత మాట్లాడుతూ రబీ సాగులో వరి, మొక్కజొన్న, శనగలు, మినుము వంటి పంటల సాగు పద్ధతులు, సస్యరక్షణ చర్యలు, ఈ–క్రాప్ విధానం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వంటి అంశాలపై వీఏఏలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మోనీషా, మైలవరం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ రాంకుమార్ పాల్గొన్నారు.